# బలగం BALAGAM TV

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 24 జనవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4


### జీహెచ్ఎంసీలో
## ఇందిరమ్మ ఇళ్లకు 10 లక్షలకు పైగా దరఖాస్తులు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



జీహెచ్ఎంసీలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 10.71 లక్షల దరఖాస్తులు వచ్చాయని ప్రభుత్వ అధికారులు వెల్లడించారు. కాగా, ఇప్పటి వరకు 7.50 లక్షల దరఖాస్తులను పరిశీలించినట్లు తెలిపారు. మిగిలిన 3.21 లక్షల దరఖాస్తులను వారం రోజుల్లో పరిశీలిస్తామని హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు తెలిపారు. సర్వే పూర్తయిన తర్వాతే జీహెచ్ఎంసీలో వార్డు సమావేశాలు నిర్వహించనున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 2,249 మంది దరఖాస్తులను పరిశీలించనున్నారని పేర్కొన్నారు.

https://indirammaindlu.telangana.gov.in/applicantSearch వెబ్ సైట్ లో సర్వే సిబ్బంది వివరాలు ఉంటాయన్నారు. గతంలో దరఖాస్తు చేసుకోని వారు వార్డు సమావేశాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు అని తెలిపారు.



## 1912ను విస్తృతంగా ప్రచారం చేయాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

108 మాదిరే విద్యుత్ సమస్యల పరిష్కారానికి 1912 ఫోన్ నంబర్‌పై విస్తృత ప్రచారం చేయాలని అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. వచ్చే వేసవిలో రెప్పపాటు కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గురువారం ప్రజా భవన్ లో ఎస్పీడీసీఎల్, ట్రాన్స్కో అధికారులతో రానున్న వేసవిలో విద్యుత్ సరఫరా ప్రణాళికాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. వేసవిలో విద్యుత్ అంతరాయం అనే మాట తలెత్తకుండా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ నిరాటంకంగా సరఫరా చేయాలని ఆదేశించారు. వేసవి ప్రణాళిక అమలులో భాగంగా సీఎండీలు మొదలు ఎస్ఈల వరకు క్షేత్రస్థాయిలో విస్తృతంగా సమీక్ష, అవగాహన సమావేశాలు నిర్వహించాలని కోరారు.

108 తరహాలోనే విద్యుత్ సరఫరాలో సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు ఏర్పాటు చేసిన 1912 ను విస్తృతంగా ప్రచారం చేయాలని మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. 1912 కు వచ్చిన ఫిర్యాదులను వెనువెంటనే పరిష్కరించాలని, ఈ వ్యవస్థ నిర్వాహణ ప్రచారానికి అదనపు నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో వచ్చే మార్చిలో పీక్ డిమాండ్ కు అనుగుణంగా 6328 మెగా వాట్ల విద్యుత్ సరఫరా చేయడానికి కావలసిన అన్నీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవిలో పీక్ డిమాండ్ ను తట్టుకునే విధంగా ట్రాన్స్ మిషన్ వ్యవస్థను బలోపేతం చేయాలని మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. సబ్ స్టేషన్ల వారీగా ఓవర్ లోడ్ సమస్యలను గుర్తించి ముందే వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు. ఒకవేళ ఈదురు గాలుల వలన విద్యుత్ అంతరాయం ఏర్పడితే ఈఆర్టీ (ఎమర్జెన్సీ రీస్టోర్ టీం) వాహనాలను వాడుతున్నారని తెలిపారు. ఇంధన శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్కో సీఎండీ డీ కృష్ణ భాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసభల్లో నిరసనలు...



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ప్రజాపాలన గ్రామసభల్లో గురువారం నిరసనలు, కొనసాగాయి. సంక్షేమ పథకాల లబ్దిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని, రీసర్వే చేయాలంటూ జనం డిమాండ్ చేశారు. పలుచోట్ల బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ఘర్షణకు దిగారు. ప్రొటోకాల్ విషయంలో వివాదం ఏర్పడింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ మండల పరిధిలోని శ్రీరంగవరం, నూతన్‌కల్ గ్రామాల్లో గురువారం నిర్వహించిన గ్రామ సభల్లో గందరగోళం నెలకొంది. అనర్హులకు పథకాలు వచ్చాయని ఇందిరమ్మ కమిటీ సభ్యుల ముందే గ్రామస్తులు ఆందోళన చేశారు. జవహర్‌నగర్ 19వ డివిజన్ రాజీవ్ గాంధీ నగర్‌లో ప్రొటోకాల్ వివాదం ఏర్పడింది. ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ ఫొటోలు లేవని కార్పొరేటర్ మేక లలిత యాదవ్ అభ్యంతరం తెలిపారు.ఖమ్మం జిల్లా ఖమ్మం అర్బన్ మండలం 57వ డివిజన్‌లో నిర్వహించిన డివిజన్ మహాసభ రసాభాసగా జరిగింది.కాంగ్రెస్ నాయకులకు మాత్రమే రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు పథకాలు అందజేశారని స్థానిక కార్పొరేటర్ ముస్తాఫా, అధికారులను నిలదీశారు. బోనకల్ మండలం రావినూతల గ్రామసభలో సంక్షేమ పథకాల జాబితాలో తమ పేర్లు ఎందుకు లేవంటూ దళిత కాలనీకి చెందిన ప్రజలు ఎంపీడీవో రురావత్ రమాదేవిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది కుర్చీలు విసిరేశారు. బోనకల్ గ్రామసభలో అంతోటి నిర్మల తనకు ఇల్లు లేదని, పెన్షన్ రావటం లేదని బోరున ఏడ్చుకుంటూ అధికారులను నిలదీసింది. చిరునోముల గ్రామసభలో ఓ యువకుడు మద్యం మత్తులో తన చేతిలో ఉన్న కాగితాలను అధికారులపైకి విసిరేశాడు.

ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని పొన్నారి గ్రామసభలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఫొటో లేదని ఆ పార్టీ నాయకులు ఆందోళన చేశారు. ఫ్లెక్సీని తొలగించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గ్రామసభల్లో పథకాల జాబితాలపై అభ్యంతరాలు నిరసనలు వ్యక్తమయ్యాయి. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో నిర్వహించి గ్రామ సభల్లో లబ్ధిదారుల జాబితాలో అర్హుల పేర్లు లేవని, రీ-సర్వే చేయాలని గ్రామస్తులు అధికారులతో వాగ్వాదానికి దిగారు.

సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని జీర్లపల్లి గ్రామసభలో అధికారులను ప్రజలు నిలదీశారు. ఇండ్ల వద్దకు వచ్చి ఫొటోలు తీసుకున్నా తమను ఎంపిక చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీలో పనులు చేయకున్నా లిస్ట్‌లో పేర్లు ఎలా వచ్చాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని సలాక్‌పూర్ గ్రామసభలో.. అనర్హుల పేర్లు జాబితాలో ఎక్కువగా ఉన్నాయని మాజీ సర్పంచ్ వంగ భాస్కర్‌రెడ్డి, గ్రామస్తులు అధికారులను నిలదీశారు. అదేవిధంగా బ్యానర్‌పై మాజీ సీఎం, స్థానిక ఎమ్మెల్యే కేసీఆర్, ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి ఫొటోలు లేవని గజ్వేల్ గ్రామసభలో స్థానికులు తహసీల్దార్ శ్రవణ్ కుమార్‌ను నిలదీశారు.

ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారి పేర్లు లబ్దిదారుల జాబితాలో ఎందుకు లేవని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అధికారులను నిలదీశారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం సైదాబాద్ గ్రామసభకు ఆయన హాజరయ్యారు. సభ ముందు కింద కూర్చుండి మాజీ సర్పంచ్ పుప్పాల శైలజరాజారామ్‌తో కలిసి నిరసన తెలిపారు. అధికారులకు పూలు అందజేస్తూ, రెండు చేతులు జోడించి దండం పెట్టి గ్రామ ప్రజల సమస్యలను వినిపించారు. వీణవంక మండలం చల్లూరు గ్రామసభకు హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వస్తున్నారనే సమాచారంతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. సంక్షేమ పథకాలు అందరికీ అందే విధంగా కచ్చితమైన హామీ ఇవ్వాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఈ సందర్భంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో బీజేపీ నాయకులు, ఎమ్మెల్యేకు మధ్య వాగ్వాదం జరిగింది.

### మహాకుంభమేళాలో
## 10 కోట్లకు పైగా భక్తుల పుణ్యస్నానాలు

వివరాలు 2వ పేజీలో

## ఐటీ ఉద్యోగులు నాకు గర్వకారణం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

'ఐటీ రంగంలో ఉన్న ఉద్యోగులు నాకు ఎప్పటికీ గర్వకారణం' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. 'ఐటీ పరిశ్రమల్లో ఉండాలంటే నిజమైన ప్రతిభ, విద్య, అంకితభావం అనేవి చాలా అవసరం. కానీ, సంచుల కొద్దీ డబ్బులతో ఎమ్మెల్యేలను కొనేందుకు, ఢిల్లీ బాసులకు డబ్బుల మూటలు పంపడానికి ఇవేమీ అవసరం లేదు' అని ఎద్దేవాచేశారు. తనను ఒక ఐటీ ఉద్యోగి అని మాట్లాడిన వారికి ఆయన సమాధానం చెప్పారు. ఈ మేరకు గురువారం ఎక్స్‌వేదికగా ఆయన స్పందించారు.

'నన్ను ఒక ఐటీ ఉద్యోగి అని మాట్లాడొచ్చని అనుకునేవాళ్లకు నేను ఒక్కటే చెప్పదలుచుకున్నా. ఐటీ పరిశ్రమలో ఉండాలంటే నిజమైన ప్రతిభ, విద్య, అంకితభావం అనేవి చాలా అవసరం. కానీ, ఎమ్మెల్యేలను కొనడానికి, ఢిల్లీ బాసులకి డబ్బులు పంపడానికి ఇవేమీ అవసరం లేదు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఐటీ ఉద్యోగులు ఎంతో కష్టపడుతూ జీవనోపాధి పొందుతున్నారు.

ఐటీ, అనుబంధ సంస్థల్లో ఉన్న నా అకాచెల్లెండ్లకు, అన్నదమ్ములకు సలాం. మీ మేధస్సు, అవిశ్రాంత శ్రమే ఆధునిక సాంకేతిక ప్రపంచానికి వెన్నెముక. మీరు లేకుంటే ప్రగతి రథచక్రాలు ఆగిపోతాయి. మీ విద్యార్హతలకు, మీ నిబద్ధతకు కొందరు యాక్సిడెంటల్ రాజకీయ నాయకులు సరితూగరు. అలాంటి వాళ్లు ప్రవేశపట్టే అనాలోచిత విధానాలకు మనం భారీ మూల్యం చెల్లించుకుంటున్నం. నా విద్యార్హతలు, నా ఉద్యోగ అనుభవం, ఐటీలో నా నేపథ్యం, ముఖ్యంగా ఐటీ రంగంలో ఉన్న ఉద్యోగులు నాకు ఎప్పటికీ గర్వకారణం' అని స్పష్టం చేశారు.

# దావోస్... రూ.1,78,950 కోట్లు



- కొత్త ఒప్పందాలతో 49,500 ఉద్యోగాలు
- 20 సంస్థలతో ప్రభుత్వం ఎంవోయూ
- గతేడాదితో పోలిస్తే నాలుగు రెట్లు
- అమెజాన్ రూ.60 వేల కోట్ల పెట్టుబడి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో రాష్ట్రానికి మొత్తం రూ.1,78,950 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. గురువారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో రూ.లక్ష కోట్లకుపైగా పెట్టుబడులు వెల్లువెత్తాయని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇంధన ఉత్పత్తితో పాటు హైదరాబాద్‌లో ఫోర్త్ సిటీ అభివృద్ధి, ఆహారం, సేవల రంగం, ఏఐ ఆధారిత ఐటీ సేవల విస్తరణ, అత్యాధునిక డేటా సెంటర్ల ఏర్పాటుకు సంబంధించి మొత్తం 20 కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాయి.

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం దావోస్‌లో అమెజాన్ కంపెనీతో రూ.60,000 కోట్ల విలువైన అతి పెద్ద పెట్టుబడి ఒప్పందాన్ని కుదుర్చుకుంది. హైదరాబాద్ లో డేటా సెంటర్లలో పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో అమెజాన్ సంస్థ ఒప్పందం చేసుకుంది. దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరంలోని తెలంగాణ పెవిలీయన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, పరిశ్రమలు-ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారితో అమెజాన్ వెబ్ సర్వీసెస్ గ్లోబల్ పబ్లిక్ పాలసీ వైస్ ప్రెసిడెంట్ మైఖేల్ పుంకేతో భేటీ అయ్యారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ రూ. 60,000 కోట్ల పెట్టుబడుల ప్రణాళికలతో హైదరాబాద్‌లో తమ డేటా సెంటర్‌లను పెద్ద ఎత్తున విస్తరిస్తోంది.భవిష్యత్తులో అర్టిఫిషియల్ ఆధారిత క్లౌడ్ సేవల వృద్ధికి ఈ డేటా సెంటర్లు కీలకంగా మారనున్నాయి.

తెలంగాణలో తన క్లౌడ్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి 2030 నాటికి 4.4 బిలియన్ డాలర్ల పెట్టుబడులను అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఇప్పటికే ప్రకటించింది. ఒక బిలియన్ పెట్టుబడులతో రాష్ట్రంలో మూడు సెంటర్లను గతంలోనే అభివృద్ధి చేసింది. ఈ మూడు కేంద్రాలు ఇప్పటికే పనిచేస్తున్నాయి.

కొత్తగా చేపట్టే విస్తరణ ప్రణాళికలకు అవసరమైన భూమిని కేటాయించాలని అమెజాన్ వెబ్ సర్వీసెస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించింది. రాష్ట్ర ప్రభుత్వం అందుకు అంగీకరించింది. అమెజాన్ వంటి ప్రపంచ దిగ్గజ కంపెనీలు మన రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ పెట్టుబడులకు ముందుకు రావటం ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్ తో ప్రజా ప్రభుత్వం ఏడాదిగా చేపట్టిన ప్రయత్నాలు ఫలించాయని అన్నారు. ఈ ఒప్పందంతో హైదరాబాద్ దేశంలో డేటా సెంటర్ల కేంద్రంగా తిరుగులేని గుర్తింపు సాధిస్తుందని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు గారు అన్నారు



## హైదరాబాద్‌లో ఇన్ఫోసిస్ క్యాంపస్ విస్తరణ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ హైదరాబాద్‌లో తమ ఐటీ క్యాంపస్ ను విస్తరించనుంది. పోచారంలో ఉన్న ఇన్ఫోసిస్ క్యాంపస్ లో అదనంగా 17 వేల ఉద్యోగాలు కల్పించనున్నట్లు ఇన్ఫోసిస్ ప్రణాళికను సిద్ధం చేసింది. అందుకు అనుగుణంగా అక్కడున్న సదుపాయాలను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సులో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారితో ఇన్ఫోసిస్ సీఎఫ్వో జయేష్ సంగ్రాజ్కా గారు చర్చలు జరిపిన అనంతరం పెట్టుబడుల విస్తరణకు అంగీకారం కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా ఇన్ఫోసిస్ సంస్థ మొదటి దశలో రూ.750 కోట్ల పెట్టుబడితో కొత్త ఐటీ భవనాల నిర్మాణం చేపడుతుంది వచ్చే రెండు మూడేండ్ల లో ఈ నిర్మాణం పూర్తవుతుంది, ఈ కొత్త సెంటర్ రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న ఐటీ పర్యావరణ వ్యవస్థకు గణనీయంగా దోహదపడుతుంది దేశంలో ప్రముఖ ఐటీ గమ్యస్థానంగా తెలంగాణ ప్రతిష్టను మరింత పెంచుతుంది. ఇప్పటికే ఇన్ఫోసిస్ హైదరాబాద్ లో దాదాపు 35,000 మంది ఉద్యోగులున్నారు. తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకోవటం కొత్త ఆవిష్కరణలకు నాంది పలుకుతుందని, ఇప్పుడున్న ఐటీ సమూహాన్ని మరింత బలోపేతం చేయాలనే ఉమ్మడి దృక్పథాన్ని ప్రతిబింబిస్తుందని జయేష్ సంగ్రాజ్కా గారు అన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వృద్ధి చేసే లక్ష్యంతో అన్ని రంగాల్లో ప్రముఖ సంస్థలు, పారిశ్రామిక దిగ్గజాలకు ప్రభుత్వం తగినంత మద్దతు ఇస్తుందని మంత్రి శ్రీధర్ బాబు గారు స్పష్టం చేశారు.



## హైదరాబాద్‌లో విప్రో క్యాంపస్ విస్తరణ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి , పరిశ్రమలు-ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు , ఉన్నతాధికారులు ప్రఖ్యాత విప్రో సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రిషద్ ప్రేమ్‌జీ గారితో సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడుల విస్తరణకు విప్రో సంస్థ అంగీకారం తెలిపింది. విప్రో కంపెనీ హైదరాబాద్ లో తమ క్యాంపస్ విస్తరించనున్నట్లు ప్రకటించింది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని గోపనపల్లి లో కొత్తగా మరో ఐటీ సెంటర్ నెలకొల్పనుంది. దీంతో అదనంగా 5000 మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి. హైదరాబాద్‌లో ఐటీ రంగం వృద్ధిలో విప్రో కీలక భాగస్వామి. విప్రో క్యాంపస్ విస్తరణతో రాష్ట్రంలో సాంకేతిక రంగం మరింత వృద్ధి చెందనుంది. ఐటీ రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగనున్నాయి. కొత్త ఐటీ సెంటర్ రాబోయే రెండు మూడేండ్లలో పూర్తవుతుంది. ప్రభుత్వంతో విప్రో చేసుకున్న ఒప్పందంతో ప్రపంచ ఐటీ పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణ ఖ్యాతి మరింత బలోపేతమవుతుంది. విప్రో విస్తరణ ప్రణాళికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు స్వాగతించారు. విప్రో లాంటి పేరొందిన సంస్థలకు తగిన మద్దతు ఇచ్చేందుకు, వ్యాపారాలకు అనువైన వాతావరణం కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందన్నారు. కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు, అవకాశాలు సృష్టించడానికి తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేయడం తమకు ఉత్సాహంగా ఉందని ఈ సందర్భంగా విప్రో ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రిషద్ ప్రేమ్‌జీ గారు అన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వామ్యం పంచుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు గారు విప్రో కంపెనీని ఆహ్వానించారు.

## కేసులను తర్వగా ఛేదించేందుకు కృషి

- రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్
- మెదక్ ఎస్పీ కార్యాలయంలో

### సెల్యూట్ బేస్ ప్రాంగణం ప్రారంభం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ పోలీసు పటిష్టంగా ఉందని, టెక్నాలజీని సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని కేసులను త్వరితగతిన ఛేదించేందుకు కృషి చేస్తున్నా మని డీజీపీ జితేందర్ అన్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే తెలంగాణ పోలీసులు క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన వారని, శాంతిభద్రత పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. తెలంగాణ పోలీసులకు ఎవరూ సాటి లేరన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ పోలీసులు పనిచేస్తున్నారన్నారు. గురువారం డిస్ట్రిక్ట్ పోలీస్ ఆఫీస్ లో కవాతు ప్రాంగణం, సెల్యూట్ బేస్ ను ఆవిష్కరించడానికి మెదక్ జిల్లాకు విచ్చేశారు. అనంతరం సెల్యూట్ బేస్ ప్రాంగణాన్ని శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.



డ్రగ్స్ నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామని డీజీపీ చెప్పారు. పోలీస్ శాఖ ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తుందని చెప్పారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీ సంఘటనలు జరిగిన 100కు డయల్ చేయాలన్నారు. అర్బన్ ఏరియాలో అయితే పోలీసులు పది నిమిషాలు సంఘటన స్థలానికి చేరుకుంటారని, గ్రామీణ ప్రాంతాల్లో అయితే 15 నిమిషాల్లో సంఘటనకు చేరుకుంటారన్నారు. పోలీస్ సేవలు ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. పోలీస్ సంక్షేమమే ప్రథమ కర్తవ్యంగా తాను ఉన్నట్లు డీజీపీ చెప్పారు. పోలీసులకు సంబంధించిన ప్రతి విషయాన్ని ప్రభుత్వం దగ్గర తీసుకువెళ్తానన్నారు. సరెండర్ లీవులు బిల్లుల కోసం రూ.200 కోట్లను ప్రభుత్వం రిలీజ్ చేసినట్లు తెలిపారు. ఆరోగ్య భద్రతకోసం రూ. 75 కోట్లు విడుదలైనట్లు చెప్పారు. రాష్ట్రంలో 100 డయల్ సేవలందించేందుకు 2000 వాహనాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, ఎంపీ రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

### కొత్తగా పెళ్లయిన వారికి
## విడిగా కొత్త రేషన్ కార్డులు

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరంగా సాగుతుందని పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. గురువారం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణికుంటలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రేషన్ కార్డుల్లో పేరున్న ప్రతి ఒక్కరికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం అందించనున్నామని చెప్పారు. రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అడుగు ముందుకు వేసిందని అన్నారు. ఎంత మందికి అర్హత ఉంటే అంతమందికీ రేషన్ కార్డులు అందిస్తామని తెలిపారు. పెళ్లయిన వారికి విడిగా కొత్త రేషన్ కార్డులు, కుటుంబ సభ్యుల మార్పు చేర్పులు అన్ని పూర్తి చేస్తామని అన్నారు. ప్రభుత్వం 40 లక్షల కొత్త రేషన్ కార్డులు ఇస్తుందని అన్నారు. అందరికీ రేషన్ కార్డు అందిన తర్వాత ప్రతి వ్యక్తికి ఆరు కిలోల సన్న బియ్యం పంపిణీ చేస్తామన్నారు. అర్హత ఉన్న వాళ్లందరికీ ఇల్లు కట్టించే ప్రక్రియ చేపట్టామని, ఇండ్ల మంజూరు జాబితాలో పేరు లేకుంటే దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. స్వంతస్థలం ఉన్నవారు ఇల్లు కట్టుకునేందుకు ఐదు లక్షల రూపాయలు ఇస్తున్నామని, ఎస్సీ ఎస్టీలకు మరో లక్ష ఆదనంగా ఇస్తామని తెలిపారు. సాగు చేసేందుకు యోగ్యంగా ఉన్న ప్రతి ఎకరానికి సంవత్సరానికి 12000 రైతు భరోసా ఇవ్వబోతున్నామని తెలిపారు. పంట వేసినా వేయకున్నా వ్యవసాయానికి ముఖ్యంగా ఉంటే రైతు భరోసా అందుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భాగంగా భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబానికి ఏడాదికి 12,000 అందజేస్తున్నామని అన్నారు.

# ఇద్దరు పిల్లలకు ఉరేసి తల్లి ఆత్మహత్య

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దొంగతనం కేసులో భర్తను పోలీసులు తీసుకెళ్లారనే అవమాన భారంతో మహిళ తన ఇద్దరు పిల్లలకు ఉరేసి, తానూ ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన ఖమ్మం జిల్లా మధిర మండలంలో విషాదం నింపింది. నిదానపురం గ్రామానికి చెందిన షేక్ బాజీ, ప్రెజా ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు. ఐదు నెలల క్రితం వరకు బాజీ కుటుంబంతో కలిసి ఖమ్మంలో బైక్ మెకానిక్‌గా పనిచేసేవాడు. ఇదే సమయంలో బాజీపై కొంతకాలం క్రితం పలు పోలీస్ స్టేషన్లలో బైక్, చైన్ స్నాచింగ్ దొంగతనాల కేసులు నమోదయ్యాయి. గతంలో పోలీసులు ఇతన్ని అదుపులోకి తీసుకుని విచారించారు. బుధవారం సాయంత్రం ఇద్దరు పోలీసులు బాజీ వద్ద ఓ బైక్ తాళం తీసుకుని వెళ్లారు. గురువారం ఉదయం మళ్లీ వచ్చి అతణ్ణి కూడా తీసుకెళ్లారు. ఈ సమయంలో పోలీసులు వారి ఇంటిని కూడా తనిఖీలు చేశారు. బాజీ భార్య ప్రెజా, అతని తండ్రిని పలు ప్రశ్నలు అడిగారు. తరువాత తండ్రి బయటకు వెళ్లిన తరువాత ప్రెజా ఇద్దరు పిల్లలను ఇంట్లో రేకుల కడ్డీలకు ఉరేసి చంపి, తాను ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వైరా ఏసీపీ రెహమాన్ ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పోలీసులు రెండు సార్లు వచ్చి బాజీతో పాటు అతని కుటుంబ సభ్యులను ప్రశ్నించడం వల్లనే అతని భార్య, ఇద్దరు పిల్లలు ఉరేసుకున్నారని వారి బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు మధిర గ్రామీణ పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

# ట్రంప్ నిర్ణయంతో నెలలు నిండకుండానే ప్రసవాలకు భారతీయులు రెడీ

- 'జన్మత: పౌరసత్వం' రద్దు ఎఫెక్ట్
- ఫిబ్రవరి 20 నుంచి ఆదేశాలు అమల్లోకి
- ఆలోగా పిల్లలకు జన్మనిస్తేనే అమెరికా పౌరసత్వం
- దీంతో ప్రసవాలకు తొందరపడుతున్న దంపతులు
- తల్లి, బిడ్డకు ప్రమాదమంటున్న వైద్యులు




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

అమెరికా అధ్యక్ష పగ్గాలను రెండోసారి చేబూనిన డొనాల్డ్ ట్రంప్ మొదటిరోజే వందకుపైగా కార్యనిర్వాహక ఉత్తర్వులపై (ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు) సంతకాలు చేసిన విషయం తెలిసిందే. వలసల నుంచి మొదలుకొని పర్యావరణం, వాణిజ్యం వరకు అమెరికాకు సంబంధించి అనేక కీలక నిర్ణయాలను ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ల రూపంలో ట్రంప్ అమలులోకి తీసుకొచ్చారు. తన ఆలోచనల అమలులో కఠినంగా ఉండనున్నట్లు ఆయన చెప్పకనే చెప్పారు. ఈ నిర్ణయాలు అమెరికాతో పాటు ప్రపంచంపైనా ప్రభావాన్ని చూపనున్నాయి. ముఖ్యంగా జన్మతః పౌరసత్వం విధానం రద్దు చేస్తూ ట్రంప్ తీసుకొన్న నిర్ణయం.. లక్షలాది మంది భారతీయులపై తీవ్ర ప్రభావం చూపించనున్నట్లు నిపుణులు చెప్తున్నారు. ట్రంప్ నిర్ణయంతో ప్రస్తుతం భారతీయుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

అమెరికా పౌరులకు పుట్టిన వారికే కాకుండా.. వలస వచ్చిన వారికి అమెరికా గడ్డపై పిల్లలు పుడితే.. ఆ చిన్నారులకు సహజంగా అమెరికా పౌరసత్వం లభిస్తుంది. 1868లో చేసిన 14వ రాజ్యాంగ సవరణ ప్రకారం అప్పటి నుంచి ఈ జన్మతః పౌరసత్వ విధానం కొనసాగుతున్నది. అయితే, దీన్ని రద్దు చేస్తూ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. 'అక్రమ వలసదారులకు, తాత్కాలిక వీసాపై అమెరికాకు వచ్చిన వారికి పుట్టే పిల్లలకు లభించే జన్మతః పౌరసత్వాన్ని మా ఫెడరల్ ప్రభుత్వం గుర్తించబోదు' అని ట్రంప్ ప్రకటించారు. ట్రంప్ ఆదేశాలతో ఈ చట్టం వచ్చే నెల అంటే ఫిబ్రవరి 20వ తేదీ నుంచి అమల్లోకి వస్తుంది. అంతకుముందు వరకు అమెరికాలో ఉంటున్న భారతీయులు లేదా ఇతర దేశాల దంపతులకు పుట్టిన బిడ్డలను అమెరికా పౌరసత్వం లభిస్తుంది. ఆ తర్వాత పుట్టిన వారికి ఇది లభించదు. దీంతో అమెరికాలో ఉన్న భారతీయ గర్భిణిలు నెలల నిండక ముందే డెలివరీకి సిద్ధమవుతున్నట్లు అమెరికా మీడియా నివేదిస్తోంది.

నెలలు నిండకముందే పిల్లల్ని కనేందుకు భారతీయ దంపతులు తొందరపడుతున్నట్లు పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇందుకోసం ఆసుపత్రుల వద్ద క్యూ కడుతున్నారట. న్యూజెర్సీలో ప్రసూతి ఆసుపత్రికి చెందిన వైద్యురాలు ఎస్‌డి రమకు గత రెండు రోజుల వ్యవధిలోనే భారతీయ దంపతుల నుంచి ముందస్తు డెలివరీ అభ్యర్థనలు ఎక్కువైనట్లు మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా 8, 9 నెలల గర్భిణిలు సీ–సెక్షన్ (సిజేరియన్) కోసం తొందరపడుతున్నట్లు తెలిసింది.అంతేకాదు ప్రస్తుతం ఏడు నెలలు కూడా నిండని ఓ గర్భిణి సైతం ముందస్తు ప్రసవం కోసం వైద్యులను సంప్రదించినట్లు తెలిసింది. వాస్తవానికి ఆమె ప్రసవ తేదీ మార్చిలో ఉండగా.. ట్రంప్ నిర్ణయంతో ముందస్తు డెలివరీకి సిద్ధమయ్యారట. ఇలా నెలలు నిండకుండానే జరిగే కాన్పుల కారణంగా తల్లి, బిడ్డకు ప్రమాదమని వైద్యులు చెబుతున్నారు. నెలలు నిండకుండానే పుట్టిన పిల్లల్లో ఊపిరితిత్తులు పూర్తిస్థాయిలో రూపొందవని, శిశువు తక్కువ బరువు, పోషణతోపాటు నాడీ సంబంధిత సమస్యలు ఉంటాయని పేర్కొంటున్నారు.

# సీఎం రేవంత్‌కు ఎమ్మెల్సీ కవిత బహిరంగ లేఖ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచే అంశాన్ని ఇంకెంత కాలం తాత్సారం చేస్తారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కులగణన పూర్తి చేసి రిజర్వేషన్లు పెంచుతామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ద్వారా కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఏడాది గడిచినా ఇంకా అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. ఈ మేరకు గురువారం ఆమె సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. బీసీలకు ఏటా రూ.20 వేల కోట్ల చొప్పున ఐదేండ్లలో రూ.లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చి, 2024–25 బడ్జెట్‌లో అరకొర కేటాయింపులు చేసి తొలి ఏడాదే కామారెడ్డి డిక్లరేషన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఉల్లంఘించారని విమర్శించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీసీవర్గాల్లో విశ్వాసం లేదని, ఈ వైఖరితో రాష్ట్రంలో బీసీలంతా తీరని అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.'కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రధాన హామీ అయిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లను కల్పించడం. కులగణన, బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే బీసీలకు రిజర్వేషన్ల పెంపు' అంశం కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఉన్నదని ఆమె గుర్తుచేశారు. 'ఇప్పటికీ ఏడాది గడిచింది.. రిజర్వేషన్ల పెంపు అతీగతీ లేదు. అశాస్త్రీయంగా బీసీ గణన నిర్వహించి, డెడికేటెడ్ కమిషన్ పేరిట కాలయాపన చేయడమే మీ ఆలోచనగా కనిపిస్తున్నది' అని అనుమానం వ్యక్తంచేశారు. కులగణన పూర్తయి చాలాకాలం అవుతున్నదని, ఇప్పటివరకు ప్రభుత్వం ఆ వివరాలను బహిర్గతం చేయలేదని ఎమ్మెల్సీ కవిత దుయ్యబట్టారు. కులగణన వివరాలను తక్షణమే బహిర్గతం చేయాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. డెడికేటెడ్ కమిషన్ నివేదిక సిద్ధమైనట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'బీసీల అంశాల పట్ల ప్రభుత్వం ఎందుకు అంత నిర్లక్ష్యం వహిస్తున్నది? బీసీలంటే కాంగ్రెస్ పార్టీకి ఎందుకు చులకన? ఆరు నెలల్లోపే అమలుచేస్తామన్న హామీ 12 నెలలు గడిచినా ఎందుకు అమలుచేయడం లేదు? హామీని అమలుచేయడానికి ఇంకెంత కాలం పడుతుంది? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీల పదవీకాలం ముగిసి ఏడాది పూర్తయ్యిందని, మండల, జిల్లా పరిషత్‌ల పదవీకాలం కూడా ముగిసిందని, ప్రస్తుతం గ్రామాల్లో ప్రజాపాలన కాకుండా ప్రత్యేకాధికారుల పాలన సాగుతున్నదని కవిత గుర్తుచేశారు. ప్రభుత్వానికి త్వరగా రిజర్వేషన్లను పెంచి ఎన్నికలను నిర్వహించాలన్న ఉద్దేశం లేన్నట్టు స్పష్టమవుతున్నదని పేర్కొన్నారు.



## మహాకుంభమేళా..

# 10 కోట్లకు పైగా భక్తుల పుణ్యస్నానాలు

**బలగం టీవీ , ప్రయాగ్‌రాజ్**

మహాకుంభమేళాలో గురువారం మధ్యాహ్నం 12 గంటల వరకు 10 కోట్లకు పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. మకరసంక్రాంతి రోజు దాదాపు 3.5 కోట్ల మంది సంగమంలో స్నానాలు ఆచరించారు. 1.7 కోట్ల మంది పౌష్ పూర్ణిమ వేడుకల్లో పాల్గొన్నారు. దీంతో పండగల వేళలో స్నానాల ప్రదేశంలో భక్తుల సంఖ్యపై ప్రభుత్వం పరిమితులు విధించింది. మిగిలిన రోజుల్లో ఎలాంటి ఆంక్షలు అమలులో ఉండవు. అయితే ఈసారి కుంభమేళాకు 45 కోట్ల మందికి పైగా భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా. ఇప్పటివరకు 10 కోట్ల మందికి పైగా భక్తులు వచ్చినట్టు తెలుస్తోంది.

# రెండు ప్రాజెక్టులకు పేరు మార్పు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని రెండు ప్రాజెక్టుల పేర్లను మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి పేరు పెట్టారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఇక నుంచి.. ఎస్.జైపాల్ రెడ్డిని పీఆర్‌ఎల్‌ఐ ప్రాజెక్టుగా పిలుస్తారు. దీంతో పాటు సింగూరు ప్రాజెక్టు పేరును కూడా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టుకు మంత్రి దామోదర రాజనర్సింహ తండ్రి, దివంగత కాంగ్రెస్ నాయకుడు రాజనర్సింహ పేరు పెట్టారు. ఈ మేరకు రాష్ట్ర ఈ రోజు నీటిపారుదల శాఖ ఉత్తర్వులను జారీ చేసింది.

# ఇందిరమ్మ ఇళ్ల లిస్టులో పేరు లేదని ఆత్మహత్యాయత్నం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాలో తన పేరు లేదని తీవ్ర మనస్తాపం చెందిన నాగయ్య గ్రామసభ సాక్షిగా పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గ్రామస్తులు, బాధితుడి భార్య శాంత తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన నాగయ్యకు ముగ్గురు ఆడపిల్లలు కాగా, మొదటి అమ్మాయి డిగ్రీ సెకండ్ ఇయర్, రెండో అమ్మాయి 9వ తరగతి, మూడో అమ్మాయి 7వ తరగతి చదువుతున్నారు. అతడి భార్య అంగన్‌వాడీ సెంటర్‌లో టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్నది. సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు ప్రజాపాలనలో నాగయ్య దరఖాస్తు చేసుకున్నాడు.

కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో గురువారం ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామసభ నిర్వహించారు. కొత్తూరు గ్రామానికి చెందిన నాగేశ్వర రావు గ్రామసభకు హాజరయ్యారు. అయితే ఇందిరమ్మ పథకంలో లబ్ధిదారులు పేర్లు చెక్ చేయగా నాగేశ్వర రావు కుటుంబానికి రాలేదు. దీనిపై అక్కడ ఉన్న అధికారులను అడగ్గా అతని భార్య శాంతి అంగన్వాడి టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే వారికి 5 ఎకరాల భూమి ఉంది. అందువల్ల వారి దరఖాస్తును పక్కన పెట్టినట్లు తహశీల్దారు తెలిపారు. జాబితాలో తన పేరు లేదని నాగేశ్వరరావు తన వెంట తెచ్చుకున్న పురుగుల మందును తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అంతే అక్కడున్నవారు ఒక్కసారిగా షాకైయ్యారు. వెంటనే అతన్ని గ్రామస్తులు ఏటూరునాగారం ప్రభుత్వ దవాఖానకు తరలించగా మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి ములుగు ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఎంజీఎం దవాఖానకు తరలించారు. ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అధికారులు అర్హులను ఎంపిక చేయకపోవడం వల్లే తన భర్త పురుగుల మందు తాగాడని నాగయ్య భార్య శాంత కన్నీటిపర్యంతమైంది.

# నేను బ్లాక్ మనీ తీసుకోను.. నాదంతా వైట్

- విక్టరీ వెంకటేష్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

విక్టరీ వెంకటేష్ కథానాయకుడిగా వచ్చిన రీసెంట్ బ్లాక్ బస్టర్ సంక్రాంతికి వస్తున్నాం . మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్లుగా నటించిన ఈ సినిమాకు అనిల్ రావిపూడి దర్శకత్వం వహించగా.. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు ఈ సినిమాను నిర్మించాడు. జనవరి 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా వచ్చి బ్లాక్ బస్టర్ అందుకోవడమే కాకుండా.. కేవలం 9 రోజుల్లోనే రూ.230 కోట్ల వసూళ్లను రాబట్టింది. దీంతో తాజాగా మూవీ టీం సక్సెస్ మీట్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో దర్శకుడు అనిల్ రావిపూడితో పాటు నటుడు వెంకటేశ్ పాల్గొన్నారు. అయితే గత మూడు రోజులుగా టాలీవుడ్ ప్రముఖులపై ఐటీ రైడ్‌లు అవుతున్న నేపథ్యంలో ఒక రిపోర్టర్ వెంకటేశ్‌ని అడుగుతూ.. హీరోలు కనుక మొత్తం వైట్ మనీ తీసుకుంటే ఏ నిర్మాతకు బ్లాక్ ఇవ్వవలసిన అవసరం లేదు. దీనిపై మీరేం అంటారు అంటూ రిపోర్టర్ వెంకీని ప్రశ్నించగా.. వెంకటేష్ మాట్లాడుతూ.. మిగత హీరోల గురించి నాకు తెలియదు. నాదాంతా ఫుల్ వైట్. నేను తీసుకొనేదే కొంత అది కూడా వైట్‌లోనే.. అది కూడా నా చేతికి రాదు. ఆఫీస్‌కు వెళుతుంది. అందులో నుంచి కూడా నా ఖర్చుల కోసం తీసుకుంటాను అంటూ వెంకటేశ్ చెప్పుకొచ్చాడు.



# గ్రామ సభలో గందరగోళం...

- జాబితాలో అర్హులు లేరంటూ.. ప్రజల ఆరోపణలు..
- అధికారులతో వాగ్వాదం.. రీ సర్వేకు డిమాండ్.

**బలగం టీవీ , గంభీరావుపేట**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలుగు పథకాల అర్హుల ఎంపిక గ్రామసభ గంభీరావుపేట మండలం నర్మల గ్రామంలో రసాభాసగా మారింది. పథకాల లబ్ధిదారుల లో జాబితాలో అనార్హులు ఉన్నారని,అర్హులకు అన్యాయం జరుగుతుందని లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు.వెంటనే అధికారులు రీ సర్వే చేయాలని డిమాండ్ చేపట్టారు.జాబితాలో పేర్లు రాని వారు మళ్లీ దరఖాస్తులు చేసుకోవచ్చని, ప్రభుత్వం గ్రామ సభల్లో ప్రకటించే జాబితా దరఖాస్తులు మాత్రమేనని,ఎవరూ ఆందోళన చెందవద్దని దరఖాస్తుల జాబితాలో లేని వారందరూ దరఖాస్తులు చేసుకోవచ్చని అధికారులు తెలుపడం తో గ్రామస్తులు కొద్దిసేపు శాంతించారు . నర్మల గ్రామంలో మొత్తం ఇందిరమ్మ ఇల్లుకి 411 అప్లికేషన్ రాగా అందులో 266 మాత్రమే జాబితాలో రావడంతో 266 మంది అని అర్హులని గ్రామస్తులు మండిపడ్డారు. దానితోపాటు సాగుకు యోగ్యం కాని భూమి 43 ఎకరాలు రైతు భరోసా రాదు అని అధికారులు తెలిపారు.ఆత్మీయ భరోసా 42 మందికి రాగా 90 శాతం అనర్హులు ఉన్నారని అసలైన వారికి గుర్తించి ఆత్మీయ భరోసా ఇవ్వాలని అధికారులకి గ్రామస్తులు విన్నవించారు. గ్రామ సభలో కొంతసేపు అధికారుల ముందే కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులు వాగ్దానానికి దిగారు. గతంలో 10 సంవత్సరాలు మీరు ఏమి చేశారని, గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజల నుండి డబ్బులు వసూలు చేసి తమకు ఇష్టమున్నవారికి డబుల్ బెడ్ రూమ్ ఇచ్చారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులు న్యాయం జరుగుతుందని అన్నారు. గ్రామసభ ముగియకముందే గ్రామస్తులు మధ్యలోనే లేచి వెళ్లారు ఏదైనా ఉంటే రాతపూర్వకంగా రాసి ఇవ్వాలని మేము పై అధికారులకు అందజేస్తామని ప్రజలకు



## ఘనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు

**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆత్మీయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నేతాజీ చిత్రపటానికి పూలమాలవేసి,128 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కౌడగాని వెంకటేష్ మాట్లాడుతూ: రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని తరిమి కొట్టిన మహనీయుడు నేతాజీ అని, ఆయన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. నేటి తరం విద్యార్థులు యువత నేతాజీని స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు.ఆత్మీయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ: నేతాజీ దేశం గర్వించ దగ్గ గొప్ప మహనీయుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్,ప్రధాన కార్యదర్శి బోయిని వేణు యాదవ్,ఉపాధ్యక్షులు మెట్టు రాకేష్, షాన్,సురేష్ బాబు, మల్లేష్ ,మధు, బాబు, తదితరులు పాల్గొన్నారు.

# నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్ థీమ్‌తో జాతీయ ఓటర్ దినోత్సవ వేడుకలు..

- కలెక్టర్ సంజయ్ కుమార్ ఝ

**బలగం టీవీ ,సిరిసిల్ల**

నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్ అనే థీమ్ తో 15వ జాతీయ ఓటర్ దినోత్సవ వేడుకలను జనవరి 25 న సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్నామని కలెక్టర్ సంజయ్ కుమార్ ఝ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఓటర్ నమోదు పెంపు, ఎథికల్ ఓటింగ్ పై అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం



జనవరి 25న జాతీయ ఓటర్ దినోత్సవంగా వేడుకలు నిర్వహిస్తామని, ఈ సంవత్సరం నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ షఉ్యర్ అనే థీమ్ తో వేడుకలు జరుగుతున్నాయని అన్నారు.

జిల్లాలోని ప్రతి బూత్ స్థాయి అధికారి పోలింగ్ స్టేషన్ పరిధిలో నూతన ఓటర్లకు ఓటర్ కార్డుల పంపిణీ, వృద్ధ ఓటర్ల సన్మానం వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రతి గ్రామం, వార్డులలో ఓటర్ ప్లేడ్జ్ తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో జనవరి 25న ఉదయం 11 గంటలకు జరిగే జిల్లా స్థాయి జాతీయ ఓటర్ దినోత్సవ వేడుకలకు హాజరై విజయవంతం చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# మహనీయుల జీవితాలు మనకు వ్యక్తిత్వ వికాస పాఠాలు



- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల**

మహనీయుల జీవితాల నుంచి మనం అనేక వ్యక్తిత్వ వికాస పాఠాలను నేర్చుకోవచ్చని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన స్వర్గీయ నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, జిల్లా అధికారులు లతో కలిసి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పాల్గొన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఆజాద్ హింద్ ఫౌజ్ ను స్థాపించిన మహనీయుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని, ఆయన జయంతి వేడుకలను జరుపుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. 1897 సంవత్సరం జనవరి 23న సుభాష్ చంద్రబోస్ జన్మించారని, దేశ స్వాతంత్ర్యం కోసం అనేక ఉద్యమాలలో పాల్గొన్నారని, ఆజాద్ హింద్ ఫౌజ్ ను స్థాపించి పోరాడారని, ఆ సంస్థే నేడు ఇండియన్ నేషనల్ ఆర్మీ గా ఉందని అన్నారు. మహనీయుల జయంతి వేడుకలు నిర్వహించడం ద్వారా వారి జీవితంలోని ముఖ్యాంశాల నుంచి మనం వ్యక్తిత్వ వికాస పాఠాలు అనేకం నేర్చుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో రామ్ రెడ్డి, కలెక్టర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో పలు అంశాలపై చర్చ

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ బోయిని ఎల్లేష్ యాదవ్

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ అధ్యక్షతన పాలక వర్గం 2వ సాధారణ సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగింది.ఈ సమావేశంలో సభ్యులందరూ కలసి పలు అంశాలపై చర్చించి, తీర్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు ఎండీ బాబు, అనుముల హరికృష్ణ, గుడి శేఖర్ రెడ్డి, కళ్లపెల్లి సతీష్, మెరుపుల మహేష్, నిరటి ప్రదీప్, అద్దంకి రమేష్, రోమాల అజయ్, ట్రేడర్ జక్కని సందీప్, మార్కెట్ కార్యదర్శి పి.రమణ మరియు మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.



## నేడు రాష్టానికి సీఎం రేవంత్‌రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్**

సీఎం రేవంత్‌రెడ్డి తన విదేశీ పర్యటనలో భాగంగా దావోస్ నుంచి శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల 35 నిమిషాలకు బయలుదేరి రాత్రి 11 గంటల 45 నిమిషాలకు దుబాయ్‌కు చేరుకోనున్నారు. దుబాయ్ నుంచి నుంచి శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల 30 నిమిషాలకు బయలుదేరి శుక్రవారం ఉదయం 8.25 నిమిషాలకు హైదరాబాద్‌కు సీఎం చేరుకుంటారని సిఎంఒ వర్గాలు పేర్కొన్నాయి.

## ఉబర్, ఓలాకు కేంద్రం నోటీసులు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఉబర్, ఓలా వంటి యాప్‌లు ఒకే దూరానికి ఆండ్రాయిడ్‌లో ఒక ఛార్జీని, ఆపిల్ ప్లాట్‌ఫామ్‌లో వేరే ఛార్జీని వసూలు చేస్తుండటంపై ఇటీవల పెద్ద ఎత్తున చర్చ నడిచిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం తాజాగా స్పందించింది. ఈమేరకు పూర్తి వివరణ ఇవ్వాలని కేంద్ర వినియోగదారుల మంత్రిత్వశాఖ ఉబర్, ఓలా సంస్థలకు నోటీసులు జారీ చేసింది. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు రావడంతో వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ సీసీపీఏ విచారణ చేపట్టింది. ఈ క్రమంలో తాజాగా చర్యలకు ఉపక్రమించింది. ఛార్జీల వసూలు, అందుకు అనుసరిస్తున్న పద్ధతుల గురించి వివరాలు ఇవ్వాలని నోటీసుల్లో కోరింది. వివక్షతకు సంబంధించి ఆందోళనల్ని పరిష్కరించాలని స్పష్టం చేసింది. ఆండ్రాయిడ్ ఫోన్ నుంచి క్యాబ్ బుక్ చేసిన వారితో పోలిస్తే ఐఫోన్ నుంచి బుక్ చేసిన వారికి ఎక్కువ ఛార్జీ పడుతుందా ? ఐఫోన్ వినియోగదారులను ధనికులుగా చూస్తూ కంపెనీలు కంపెనీలు ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నాయా? చాలా కాలంగా వినియోగదారుల్లో ఈ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలే ఢిల్లీకి చెందిన ఓ వ్యక్తి ఈ ధరల్ని వేర్వేరు మొబైళ్లలో పోలుస్తూ ఎక్స్‌లో పోస్టు చేశారు. అంతేకాదు ఇటీవల టైమ్స్ ఆఫ్ ఇండియా చేపట్టిన పరిశీలన లోనూ ఈ విషయం వెల్లడైంది. చెన్నై లోని మూడు రూట్లలో ఈ సంస్థ ప్రతినిధులు ఆండ్రాయిడ్, ఐఫోన్‌ల నుంచి ఒకే సమయంలో క్యాబ్‌లు బుక్ చేశారు. మూడు రూట్ల లోనూ ఆండ్రాయిడ్ నుంచి బుక్ చేసిన వారి కంటే ఐఫోన్ నుంచి బుక్ చేసిన వారికి ఎక్కువ ఛార్జీ పడింది.

# సూపర్ 6కు భారత అమ్మాయిలు



- అండర్ 19 టీ20 ప్రపంచకప్‌లో శ్రీలంకపై భారత్ ఘన విజయం
- హ్యాట్రిక్ విజయాలతో సూపర్6కు భారత్

**బలగం టీవి, హైదరాబాద్**

అండర్-19 మహిళల టీ20 ప్రపంచ కప్‌లో భారత జట్టు దూసుకుపోతోంది. ఇప్పటికే వరుసగా రెండు మ్యాచుల్లో గెలిచిన భారత్ తాజాగా జరిగిన మ్యాచ్‌లోనూ విజయం సాధించింది. శ్రీలంకను 60 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించింది. ఈ విజయంతో సూపర్ -6లోకి దూసుకెళ్లింది భారత్.

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ కు దిగిన టీమిండియా 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 118 పరుగులు సాధించింది. తెలుగమ్మాయి ఓపెనర్ గొంగడి త్రిష త్రుటిలో హాఫ్ సెంచరీని చేజార్చుకుంది. 44 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్ సాయంతో 49 పరుగులు చేసింది. ఈమె మిన హా ఇంకెవ్వరూ పెద్దగా రాణించలేదు. మిథిలా వినోద్ (16), జోషిత (14), కెప్టెన్ నిక్కి ప్రసాద్ (11), నామమాత్రపు పరుగులు చేశారు. భవికా (7), ఆయుషి (5), కమలిని (5) నిరాశ పరిచారు. లంక బౌలర్లలో ఏసేని తలగునె, ప్రముది, లిమాన్స తిలకరత్న తలో రెండు వికె ట్లు తీశారు. చామోడి ప్రభోద, రష్మిక, మనుడి నానయక్కర ఒక్కో వికెట్ దక్కించుకున్నారు.

లక్ష్యఛేదనలో శ్రీలంక.. భారత బౌలర్ల దెబ్బకు కుప్పకూలిపోయింది. 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 58 పరుగులే చేసింది. లంక జట్టులో టాప్-5 ఉన్న బ్యాటర్లలో ఏ ఒక్కరు కూడా రెండంకెల స్కోరు చేయలేకపోయారు. పరుగులు చేయడానికి బాగా ఇబ్బంది పడ్డారు. రష్మిక సెవ్వండి 15 పరుగులతో టాప్ స్కోర్‌గా నిలిచింది. టీమిండియా బౌలర్లలో షబ్నమ్ , జోషిత , పరుణికా సిసోధియా తలో రెండు తీశారు. వైష్ణవి శర్మ, ఆయుషి శుక్లా తలో ఒక్కో వికెట్ దక్కించుకున్నారు.

# రంజీలోనూ రోహిత్ విఫలం



జమ్మూ కశ్మీర్‌తో మ్యాచ్‌లో 3 పరుగులకే అవుటైన హిట్‌మ్యాన్

**బలగం టీవి, ముంబై**

రోహిత్ శర్మ రంజీలోనూ విఫలమవుతున్నాడు. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా సిరీస్‌ల్లో దారుణంగా విఫలమైన హిట్‌మ్యాన్.. సిడ్నీ టెస్టులో బరిలోకి దిగలేదు. దీంతో పేలవ ఫామ్ నుంచి బయటపడేందుకు దేశవాళీ క్రికెట్‌ను నమ్ముకున్నాడు. ఈ మేరకు రంజీ ట్రోఫీలో భాగంగా జమ్మూ కశ్మీర్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ముంబై తరపున బరిలోకి దిగాడు రోహిత్. అయితే హిట్‌మ్యాన్ 19 బంతుల్లో కేవలం 3 పరుగులే చేసి ఔట్ అయ్యాడు. ఉమర్ రజీన్ మీర్ అనే బౌలర్ చేతుల్లో ఔటై అభిమానుల్ని తీవ్రంగా నిరాశప ర్చాడు హిట్‌మ్యాన్. కశ్మీర్ బౌలర్ వేసిన బౌన్సర్‌కు అతను చిక్కాడు. షార్ట్ ఆఫ్ లెన్త్ బంతిని .. హుక్ షాట్ ఆడబోయి రోహిత్ మిడాఫ్‌లో క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. యుధిర్ సింగ్ అతని క్యాచ్ పట్టేశాడు. క్రీజులో ఉన్నంత సేపు పరుగులు చేసేందుకు రోహిత్ తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. భారీ షాట్లను కొట్టేందుకు ప్రయత్నిం చినా సరిగ్గా టైమింగ్ చేయలేకపోయాడు . డిఫెన్స్‌లోనూ తడబడుతూ కనిపించాడు.

ఈ మ్యాచ్‌లో రోహిత్‌తో పాటు ఇతర టీమిండియా స్టార్లు కూడా దారుణంగా విఫలమయ్యారు. యశస్వి జైస్వాల్ (4), అజింక్యా రహానె (12), శ్రేయస్ అయ్యర్ (11), శివమ్ దూబె (0) రెండంకెల స్కోరు చేసేందుకు కూడా చెమటోడ్చారు. దీంతో ముంబై ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 33.2 ఓవర్లలో 120 పరుగులకు ఆలౌట్ అయింది. ఓ దశలో 47 పరుగులకే ఆ జట్టు ఏడు వికెట్లను కోల్పోయింది. అయితే 8వ వికెట్‌కు శార్దూల్ ఠాకూర్, తనుష్ కొటియాన్ కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పింది.

# "ఇది విరాట్ కోహ్లీ జమానా"



## కోహ్లీపై సీఎం రేవంత్ రెడ్డి ప్రశంసలు

**బలగం టీవి, హైదరాబాద్**

విరాట్ కోహ్లీపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్‌కు వెళ్లిన సీఎం రేవంత్.. అక్కడ మీడియాతో చిట్‌చాట్‌లో భాగంగా పలు అంశాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అందులో భాగంగా క్రికెట్ ప్రస్తావన రాగానే ఒకవైపు సచిన్, గవాస్కర్‌ను పొగుడుతూనే మరోవైపు ఇది అతడి జమానా అంటూ విరాట్‌ను పొగడ్తల్లో ముంచెత్తారు సీఎం. 'క్రికెట్‌లో సచిన్ టెండూల్కర్, సునీల్ గవాస్కర్ ఇద్దరూ దిగ్గజాలుగా చెప్పాలి. కానీ ఇది విరాట్ కోహ్లీ జమానా. ఈ ఆట ఎలా ఆడాలో అతడు నేర్పిస్తున్నాడు' అని అన్నారు. ఒకవైపు సచిన్ గ్రేట్ అంటూనే మరోవైపు కోహ్లీ కూడా తోపు అంటూ ఇద్దర్నీ ప్రశంసల్లో ముంచెత్తారు. ఈ తరం కోహ్లీదేనని మెచ్చుకున్నారు.

# షమీని తీసుకోకపోవడంపై సూర్య క్లారిటీ

**బలగం టీవి, ముంబై**



ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన తొలి టీ20లో భారత తుది జట్టులో షమీ కనిపించకపోవడం క్రీడాభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. దీంతో అతడింకా పూర్తి ఫిట్‌నెస్ సాధించలేదా లేకుంటే ఇంకేమైనా రీజన్స్ ఉన్నాయా అన్న అనుమానాలు మొదలయ్యాయి. అయితే దీనిపై టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ క్లారిటీ ఇచ్చాడు. ఎక్స్‌ట్రా స్పిన్నర్‌ను ఆడించేందుకే మహమ్మద్ షమీని తుది జట్టులోకి తీసుకోలేదని తెలిపారు. మ్యాచ్ అనంతరం సూర్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ 'టాస్ గెలిచినప్పటి నుంచి మ్యాచ్ ముగిసేవరకూ ఒకే జోరును కొనసాగించాం. ముందుగా మా ప్రణాళికలకు అనుగుణంగా బౌలింగ్ సాగింది. తర్వాత లక్ష్యాన్ని సునాయ సంగా అందుకున్నాం. పిచ్ కండిషన్స్‌ను బట్టే ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగాం. సౌతాఫ్రి కాలోనూ ఇదే విధంగా ఆడాం. ముగ్గురు స్పిన్నర్లూ అద్భుతంగా రాణించారు. కొత్త బంతితో హార్దిక్ పాండ్యా బౌలింగ్ చేసేందుకు ముందుకు వచ్చాడు. దాంతోనే అదనపు స్పిన్నర్‌ను తీసుకున్నాం. వరుణ్ చక్రవర్తి పరిస్థితులను వేగంగా అందిపుచ్చుకుంటాడు. అద్భుతమైన రికార్డ్ సాధించిన అర్ష్‌దీప్ సింగ్‌కు అభినందనలు. హార్దిక్ పాండ్యాతో కలిసి కొత్త బంతితో బౌలింగ్ చేయాల్సి ఉంటుందని అర్ష్‌దీప్ సింగ్‌కు తెలుసు. అదనపు బాధ్యతలను తీసుకునేందుకు ముందుకు రావడం అభినందనీయం. ఆటగాళ్లకు స్వేచ్ఛ ఇవ్వడంలో గౌతమ్ గంభీర్ ముందుంటాడు. ఫీల్డింగ్‌లోనూ మెరుగ్గా రాణించాం. ఫీల్డింగ్ కోచ్ దిలీప్‌తో కలిసి చాలా శ్రమించాం.'అని సూర్యకుమార్ యాదవ్ చెప్పుకొచ్చాడు.

# బాలీవుడ్ సెలబ్రిటీలకు బెదిరింపులు..



**బలగం టీవి, ముంబై**

బాలీవుడ్ సెలబ్రిటీలకు వరుస బెదిరింపులు సంచలనం రేపుతున్నాయి. ఇప్పటికే లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ వరుస బెదిరింపులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఇటీవల సైఫ్ అలీఖాన్‌పై దుండగుడు కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన సైఫ్ ప్రస్తుతం కోలుకుంటున్నాడు. ఇంతలోనే పలువురు బాలీవుడ్ సెలబ్రిటీలకు హత్య బెదిరింపులు కలకలం రేపుతున్నాయి. బాలీవుడ్ స్టార్ కమెడియన్ కపిల్ శర్మ తోపాటు రాజ్‌పాల్ యాదవ్ , రెమో డిసౌజా ), సుగంధ మిశ్రాకు హత్య బెదిరింపులు వచ్చినట్లు పోలీసులు తాజాగా తెలిపారు. బిష్ణు అనే పేరుతో వీరికి బెదిరింపు మెయిల్ వచ్చినట్లు పేర్కొన్నారు. కాగా, బెదిరింపు మెయిల్‌లో 'మేము మీ ప్రతి కదలికను ఎప్పటికప్పుడు నిశితంగా గమనిస్తున్నాం. ఇది పబ్లిక్ స్టంట్ లేదా మిమ్మల్ని వేధించే ప్రయత్నం అయితే కానే కాదు. మీరు ఈ సందేశాన్ని సీరియస్‌గా తీసుకోండి' అంటూ ఈ-మెయిల్లో పేర్కొన్నట్లు పలు మీడియా సంస్థలు రిపోర్టు చేశాయి.

బెదిరింపు మెయిల్ పంపిన వ్యక్తి తన డిమాండ్లను ఎనిమిది గంటల్లోగా నెరవేర్చకపోతే ప్రమాదకరమైన పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించినట్లు తెలిసింది. అయితే ఆ వ్యక్తి డిమాండ్లు ఏంటన్నవి మాత్రం ఇంకా బయటకు రాలేదు. ప్రముఖుల ఫిర్యాదు మేరకు అంబోలి, ఓషివారా పోలీస్ స్టేషన్లలో కేసు నమోదైంది. ఈ ఘటనపై విచారణ జరిపిన పోలీసులు ఈ మెయిల్ ఐపీ అడ్రస్ పాకిస్థాన్‌కు చెందినదిగా ప్రాథమిక విచారణలో గుర్తించారు. తదుపరి విచారణ కొనసాగుతోంది.

# స్కై ఫోర్స్ సినిమాకు బంపరాఫర్

**బలగం టీవి, ముంబై**




బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ నటించిన తాజా చిత్రం స్కై ఫోర్స్). ఈ సినిమాతో వీర్ పహరియా బాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తుండగా.. సందీప్ కెవ్లానీ, అభిషేక్ కపూర్ సంయుక్తంగా దర్శకత్వం వహించారు. ఈ సినిమాను రిపబ్లిక్ డే కానుకగా నేడు ప్రేక్షకుల ముందుకు రానుంది. భారత దేశ మొదటి వైమానిక దాడి ఆధారంగా ఈ సినిమా రూపొందగా.. ఇందులో సారా అలీ ఖాన్, నిమ్రత్ కౌర్ కీలక పాత్రలు పోషించారు. జియో స్టూడియోస్, మడాక్ ఫిల్మ్స్ బ్యానర్‌లపై దినేశ్ విజన్ ఈ సినిమాను నిర్మించాడు. అయితే ఈ సినిమా విడుదలకు ముందే బంపరాఫర్ ప్రకటించింది చిత్రబృందం. ఈ సినిమాకు బుక్ మై షోలో రూ.250 విలువైన కూపన్ కోడ్ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. SkyForce250 అనే కూపన్ కోడ్‌ని ఎంటర్ చేస్తే ఫ్రీగా సినిమా చూడవచ్చని తెలిపింది. ఈ ఆఫర్ విడుదల రోజైన 24 నుంచి రిపబ్లిక్ డే వరకు కొనసాగుతుందని తెలిపింది. ఈ ఆఫర్‌ను పొందడానికి యూజర్లు మొబైల్ నెంబర్‌తో లేదా ఈమెయిల్‌తో లాగిన్ అవ్వవలసి ఉంటుందని ప్రకటించింది.

# ఇంటర్వెల్‌కే మొత్తం డబ్బు ఇచ్చేయొచ్చు : థమన్



నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం అఖండ 2 షూట్‌తో బిజీగా ఉన్నాడని తెలిసిందే. ఈ చిత్రానికి ఎస్ థమన్ మరోసారి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తాజాగా డాకు మహారాజ్ సక్సెస్ ఈవెంట్‌లో ఎస్ థమన్ చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. డాకు మహారాజ్ తీసుకొచ్చి ఇక్కడ ఆపింది. అఖండ 2 ఏం చేస్తుందో నాకు తెలుస్తోంది. అసలు మామూలుగా ఉండదు.. మీరు ముందుగా ప్రిపేర్ అవ్వండి.. అయిపోండి. బోయపాటి మామూలు కసిగా లేదు. ఇంటర్వెల్‌కే మొత్తం డబ్బు ఇచ్చేయొచ్చు. సెకండాఫ్ మనకు అదనపు వినోదమన్నమాట. ఇప్పటి నుంచే ప్రిపేర్ అవుతున్నాం. ఆ సినిమాకు ఎలా చేయాలని ఇప్పటినుంచే చదువుకుంటున్నామంటూ చెప్పుకొచ్చాడు. ఈకామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.